

భూ తగాదాలతో
అన్నను హత్య చేసిన తమ్ముడు
కమలాపూర్‌లో ఆరుబయట నిద్రిస్తున్న వ్యక్తి.. 6

క్రిష్ణాపూర్ గ్రామ సమీపంలో
చిరుత సంచారం! 8

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పెద్దశంకరంపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులకు గణిత పాఠాలు బోధించారు. గణిత శాస్త్రంలోని మెలకువలను ఎలా నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధిస్తూనే సమాధానాలు రాబట్టారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతలు వహించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశం, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో షాకీర్‌అలీ, ప్రధానోపాధ్యాయులు విఠల్, ఉపాధ్యాయ బృందం ఉన్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు విభాగాలను పరిశీలించారు. హాజరు పట్టికను పరిశీలించి ప్రతీ రోజు ఎంతమంది పేషెంట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారో అనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సూచించారు.


పెద్దశంకరంపేటలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మలబార్ గోల్డ్ ఆభరణాల తయారీ ప్లాంట్‌ను సందర్శించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మలబార్ గోల్డ్ ఆభరణాల తయారీ ప్లాంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌తో పాటు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి గురువారం హాజరయ్యారు. ఇండస్ట్రియల్ పార్కులో నిర్మించిన ఈ ప్లాంట్‌ను ఆమె సందర్శించారు.




ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులతో కలిసి ప్రారంభోత్సవానికి హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

జీఎంసీ 'మెడికో'కు డెంగీ పాజిటివ్

సంగారెడ్డి అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో (జీఎంసీ) ఓ వైద్య విద్యార్థినికి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని కళాశాల వర్గాలు తెలిపాయి. జ్వరం, ఇతరత్ర లక్షణాలతో బాధపడుతున్న ఆమె అనుబంధ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పలు రకాల నిర్ధారణ పరీక్షలు చేసుకోగా డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని వివరించాయి. దీంతో అప్రమత్తమైన మెడికల్ కళాశాల అధికారులు నివారణ చర్యలు చేపట్టారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో కళాశాల హాస్టల్ భవనాలతో పాటు పరిసరాలను దోమల నివారణ మందుతో పిచికారీ చేయించారు.

హెచ్‌ఐవీ బాధితులకు 'చేయూత'

కొత్తగా 1058 మందికి పెన్షన్

సంగారెడ్డి అర్బన్, జూలై 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఐవీ బాధితులకు శుభవార్త అందించింది. సంగారెడ్డి జిల్లాలో కొత్తగా 1,058 మందికి చేయూత కింద పెన్షన్ మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. మూడేళ్లుగా ఎదురు చూస్తున్న బాధితులకు పెన్షన్ మంజూరు చేసి సర్కారు ఊరటనిచ్చింది. ఇప్పటికే జిల్లాలో 2,032 మంది హెచ్‌ఐవీ బాధితులు చేయూత పెన్షన్ పొందుతుండగా, తాజాగా కొత్తగా 1,058 మందికి మంజూరుతో లబ్ధిదారుల సంఖ్య 3,090కు చేరింది. దీంతో కొత్తవారికి కూడా నెలకు రూ.2,016 పింఛన్ అందనున్నది. హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం తీసుకోవడంతో రోగ నిరోధక శక్తి పెరిగే అవకాశముంటుందనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పెన్షన్ అందిస్తున్నది. 2022 తర్వాత కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి పింఛన్ మంజూరు కాకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాజాగా మంత్రి సీతక్క చొరవతో ప్రభుత్వం వారికి పెన్షన్ మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో బాధితులకు ఊరటనిచ్చినట్లైంది.


తమ వారి ఆచూకీ కోసం అధికారులను ఆరా తీస్తున్న కుటుంబసభ్యులు

నిర్లక్ష్యమే కారణమా?

సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదం వెనుక అధికారుల నిర్లక్ష్యమూ ఓ కారణంగా చెబుతున్నారు. అన్ని శాఖల అధికారులు నిత్యం తనిఖీలు చేయాల్సి ఉండగా, మామూళ్లు తీసుకుని మిన్నకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలోనే హెచ్చరించామంటూ కర్మాగారాల శాఖ అధికారులు చెపుతున్నా, అందుకు తగ్గట్టుగా పరిశ్రమ యజమానిపై ఎటువంటి కేసులు పెట్టిన దాఖలాలు లేవు. బాయిలర్ శాఖ అధికారులు మాత్రం చుట్టపు చూపుగా వచ్చామా వెళ్లామా అన్నట్టుగా సందర్శించి వెళతారు. ఇక వీరి కార్యాలయం అబిడ్స్‌లో ఉంది. వీరి వద్దకు వెళ్లాలంటే ముందుగా ఫోన్‌చేసి చిరునామా తెలుసుకొని ఉంటారా లేదా అని అడిగి వెళ్లాల్సి ఉంటుంది. కాలుష్యనియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు మాత్రం ఫిర్యాదు వచ్చినప్పుడు నమూనాలు సేకరించి వెళతారు. ఆతర్వాత ఏం చేస్తారో ఎవరికీ తెలియదు. ఎయిర్‌ఫ్రైజర్‌తో పేలుడు సంభవించిన తరువాత అదే భవనంలో ఉన్న రియాక్టర్ సైతం పేలింది. దీనిపై పీసీబీ అధికారులు ఎలాంటి ప్రకటన చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. నిర్మాణ అనుమతులు మంజూరు చేసే ఐలా అధికారులు మాత్రం మౌనం పాటిస్తున్నారు. కంపెనీలో జరిగిన అన్ని రకాల నిర్మాణాల విషయంలో ఉల్లంఘనలు కళ్లకు కనిపిస్తున్నా పట్టించుకోవడం అనుమానాలకు దారి తీసింది. షెడ్, బాయిలర్, ట్రాన్స్‌ఫార్మర్, స్టీమ్ పైపులైన్‌లు పూర్తిగా ప్రహరీపై నిర్మించారు.

మావాళ్లు ఎక్కడ?

చివరిచూపునకూ నోచని వైనం.. పరిశ్రమ వద్ద పడిగాపులు

సెల్‌ఫోన్లలో ఫొటోలు చూపిస్తూ ఆరా


కుప్పలు కుప్పలుగా ఉన్న చోట ఖాళీ అయిన శిథిలాలు

పటన్‌చెరు/రామచంద్రాపురం టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడులో శిథిలాల కింద నలిగిన బతుకుల ఆచూకీ దొరకడం లేదు. మృతులంతా మాంసపు ముద్దలుగా మారడంతో బంధువుల కడచూపునకూ నోచుకోని పరిస్థితి. ఓ పక్క డీఎన్‌ఏ పరీక్షల కోసం రక్తం ఇచ్చిన కుటుంబ సభ్యులు ఆందోళనగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు 31 మంది మృతదేహాలను గుర్తించగా, ఏడుగురి మృతదేహాలు మార్చురీలో ఉన్నాయి. గురువారం పేలుడు జరిగిన ప్రాంతంలోని శిథిలాలన్నీ తొలగించారు. మార్చురీలో కేవలం ఏడు మృతదేహాలే ఉండగా, తమ వారి ఆచూకీ చెప్పాలని పలువురు ఇంకా పరిశ్రమ వద్ద వేచి ఉన్నారు. ఆ శిథిలాల్లోనూ అవశేషాల కోసం వెతుకుతున్నారు. అందులో గుర్తింపుకార్డులు, సెల్‌ఫోన్లు, పర్సులు, ఇతర వస్తువులతో పాటు ఓ అరచేయి దొరింది. ఇంకా ఆచూకీ దొరకని వారి బంధువులు మార్చురీ గదుల్లో కాలి మాసంపు ముద్దలుగా మారిన మృతదేహాలను చూసి, తమ వాళ్లు కాదంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. సెల్‌ఫోన్లలో తమ వారి ఫొటోలు చూపిస్తూ పరిశ్రమ పరిసరాల్లో తిరుగుతున్నారు. ప్రమాదం జరిగి నాలుగు రోజులు అవుతున్నా ఇంకా కొందరి ఆచూకీ చిక్కకపోవడంతో వారి ఆశలు ఆవిరే అన్న భావన వ్యక్తమవుతోంది. తమ వారి ఆచూకీ చెప్పాలని, ఒకవేళ చనిపోతే మృతదేహాలను అయినా అప్పగించాలని, కనీసం అస్థికలు ఇచ్చినా వెళ్లిపోతామని అంటుండం వారి ఆవేదనకు అద్దం పడుతోంది. మార్చురీలో ఉన్న మృతదేహాల సంఖ్య కంటే ఆచూకీ తెలియని వారే ఎక్కువగా ఉండటంతో అసలు తమవారు ఎక్కడ అన్న ప్రశ్న ఉదయిస్తోంది. మరో పక్క పేలుడు జరిగిన పరిశ్రమ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. ఎవరినీ అటువైపు వెళ్లనివ్వడం లేదు. ఇక ప్రమాదంలో చనిపోయిన వారంటూ కొన్ని ఫొటోలు, పేర్లు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే, అధికారులు మాత్రం ధ్రువీకరించలేదు. ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ గురువారం పరిశ్రమ పరిసరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించింది.

అగ్నిమాపక వాహనాలు వెళ్లేందుకు స్థలమేది?

సోమవారం ఉదయం 9.18 గంటలకు ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక వాహనం పూర్తిగా లోనికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ప్రధాన గేటులోంచి లోనికి వెళ్లినా మంటలను ఆర్పి, పక్కనే ఎగిసి పడుతున్న మంటలను ఆర్పడానికి వీలు కాలేదు. వాహనం గేటు బయటకు వచ్చి వెనక్కి వెళ్లి ఆర్పాల్సి వచ్చింది. అప్పటికే మృతదేహాలు బూడిదగా మారాయి. మరిన్ని అగ్నిమాపక వాహనాలు వచ్చినా స్థలం లేకపోవడంతో బయటనే ఉంచారు. అందుకే మంటలను తొందరగా అదుపులోకి తీసుకురాలేకపోయారని స్థానికులు చెప్పారు. పరిశ్రమకు అగ్నిమాపకశాఖ అధికారులు నిరభ్యంతర పత్రాన్ని జారీ చేయలేదు. అయినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చర్చకు దారి తీసింది.

అలుపెరగని అంబులెన్స్ డ్రైవర్లు | 6

చేప.. చేప.. ఈసారైనా చెరువుకు చేరేనా?

చేపపిల్లల పంపిణీకి ఇంకా ఖరారుకాని టెండర్లు

గత సంవత్సరమూ మెదక్ జిల్లాకు మొండిచేయి

నిరుపయోగంగా హెచరీ


మెదక్‌లోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం దుస్థితి

మెదక్, జులై 3 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు గత ప్రభుత్వం చెరువుల్లో ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేసింది. ప్రస్తుత ప్రభుత్వమూ ఈ పథకాన్ని కొనసాగించినప్పటికీ.. గతేడాది రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లోనే చేప పిల్లలను పంపిణీ చేశారు. మెదక్ జిల్లాకు మొండిచేయి చూపించారు. మెదక్ జిల్లావ్యాప్తంగా 1,717 చెరువులు, జలాశయాలు ఉండగా కేవలం 82 చెరువుల్లోనే చేపపిల్లలు వదలడంతో విమర్శలు తలెత్తాయి. జిల్లాలోని చెరువుల్లో 5 కోట్ల చేపపిల్లలు వదలాల్సి ఉంటుంది. గత సంవత్సరం చేప విత్తనం సరఫరా కోసం టెండర్ల ప్రక్రియలో పాల్గొన్న గుత్తేదారులు సరైన పత్రాలు సమర్పించకపోవడంతో అనర్హులుగా తేల్చారు. పక్క జిల్లాల కాంట్రాక్టర్ల నుంచి చేపపిల్లలను తెప్పించి 82 చెరువుల్లో వదిలారు. ఈసారి కూడా జూలై వచ్చినా టెండర్లు ఖరారు కాకపోవడంతో మత్స్యకారుల్లో ఆందోళన మొదలైంది.

ఆరు దశాబ్దాల క్రితమే..

మెదక్ పట్టణంలో 1964లో ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించిన చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 82 నర్సరీలు నిండుగా చేపపిల్లలు, తల్లి చేపలతో కళకళలాడేవి. ప్రస్తుతం వాటికి మరమ్మతులు లేకపోవడంతో లీకేజీలు, పగుళ్లు ఏర్పడి పనికిరాకుండా పోయాయి. ఇప్పుడు నామమాత్రంగా 21 నర్సరీలు మాత్రమే మిగిలినట్లు మత్స్యకార కార్యాలయం సిబ్బంది తెలిపారు. మరమ్మతులు చేస్తే జిల్లా డిమాండ్ మేరకు 5 కోట్ల చేపవిత్తనం (స్పాన్) స్థానికంగానే ఉత్పత్తి చేసుకోవచ్చునని మత్స్యకారులు పేర్కొంటున్నారు.

మత్స్యకారులకు ఉపాధి కరువు

సబ్సిడీపై చేప విత్తనం పంపిణీ చేయడంపై నీలినీడలు కమ్ముకోవడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 310 మత్స్యకార సొసైటీల పరిధిలో 16,820 మంది సభ్యులు ఉన్నారు. మత్స్యకారులలో అధిక శాతం సభ్యులు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను వెతుక్కోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే మెదక్, రామాయంపేట, చేగుంట, నర్సాపూర్, తూప్రాన్, వెల్దుర్తి, రామాయంపేట తదితర ప్రాంతాల మత్స్యకారులు చేపల వేట మానుకుని కూలీ పనులకు కూడా వెళ్తున్నారు. మెదక్ జిల్లా మత్స్యశాఖాధికారి మల్లేషం స్పందిస్తూ చెరువుల్లో సబ్సిడీపై చేపపిల్లలను వదలడంపై ఇంకా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని తెలిపారు.


ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

సజావుగా ఎప్‌సెట్ ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డి రూరల్, జూలై 3 :(ఆంధ్రజ్యోతి): 'ఎప్‌సెట్‌లో ర్యాంకులు పొందిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ సజావుగా సాగుతున్నది. హనుమాన్‌నగర్ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సహాయక కేంద్రంలో 8వ తేదీ వరకు అభ్యర్థులు సమయానుసారంగా స్లాట్ బుక్ చేసుకున్నారు. గురువారం మూడో రోజు 480 మంది అభ్యర్థులు పరిశీలనకు హాజరయ్యారు. ఇప్పటి వరకు 1,440 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

సర్వర్ సమస్యతో అవస్థలు

ఎప్‌సెట్ సహాయక కేంద్రంలో సర్వర్ సమస్యతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరవుతున్న అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నీ కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని కోఆర్డినేటర్ పి.జానకీదేవి పేర్కొన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులకు అరగంటలో ప్రక్రియ పూర్తికావాలి. కానీ, సర్వర్ సమస్యతో మూడు గంటల వరకు పడుతున్నది. దీంతో సాయంత్రం పొద్దుపోయే వరకు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొన్నదని అభ్యర్థులు వాపోతున్నారు.

గమ్యం చేరని ప్రయాణం

ప్రమాదాలకు కేంద్రంగా హైవే 65

కొనసాగుతున్న విస్తరణ పనులు

ఇరుకుగా మారిన రహదారి

రాత్రి వేళల్లో ప్రయాణం.. అరచేతిలో ప్రాణం

కనిపించని ప్రమాద సూచికలు

రహదారి పక్కనే వాహనాల పార్కింగ్


65వ నంబరు జాతీయ రహదారిపై కొనసాగుతున్న విస్తరణ పనులు

సంగారెడ్డి క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అతివేగం.. ఇరుకు రోడ్డు.. ఎక్కడపడితే అక్కడ వాహనాల పార్కింగ్.. వెరసి హైవే 65పై ప్రయాణం నరకప్రాయంగా మారింది. రాత్రి పూట వాహనాలు నడపడం ప్రాణాలతో చెలగాటమే అవుతున్నది. హైదరాబాద్ నగర సరిహద్దులోని లింగంపల్లి నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా (సంగారెడ్డి) వరకు హైవేను ఆరు వరుసలుగా విస్తరిస్తున్నారు. ఒకవైపు రోడ్డు పనులు జరుగుతుండటంతో మరోవైపు నుంచి మాత్రమే వాహనాలను అనుమతిస్తున్నారు. దీంతో వాహనాలు ఒకదానికొకటి రాసుకుంటూ వేళ్లే పరిస్థితి నెలకొన్నది. ఫ్లైఓవర్లు నిర్మిస్తున్న ప్రదేశంలో మరింత ఇబ్బందికరంగా మారింది. ఒకవైపు డివైడర్.. మరోవైపు రోడ్డు పక్కన పెద్ద గుంతలు ఉండటంతో ఎటూ తప్పించలేని పరిస్థితి.

వాహనాల రద్దీ

హైదరాబాద్-ముంబాయి నగరాల మధ్య 65వ నంబరు హైవేనే ప్రధాన రహదారి మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. హైదరాబాద్ నుంచి ముంబాయి, షిర్డీతో పాటు పలు నగరాల మధ్య ప్రైవేటు ట్రావెల్స్ ఎక్కువగా తిరిగుతుంటాయి. ఇక కర్ణాటక నుంచి కూడా నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటాయి. సాయంత్రమైందంటే రద్దీ మరింత పెరిగి గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతున్నది. విస్తరణ పనులు కొనసాగుతుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. బండెనక బండి.. అన్నట్లు వాహనం వెనుకాలే మరో వాహనం వరుస కట్టడంతో కిలోమీటరు దూరానికి అరగంట పడుతోంది. ఇది చాలదన్నట్లు జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంకులు, హోటళ్ల వద్ద భారీ వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేస్తున్నారు. అసలే ఇరుకుగా మారిన రోడ్డుపై వాహనాలు నిలుపడంతో ప్రమాదాలు


మిగతా8వ పేజీలో

రోడ్డు ప్రమాదంలో ఎస్సై దుర్మరణం

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన కారు 6

కంది శివారులో ఘటన


నుజ్జయిన కారు, మృతుడు ఎస్సై రాజేశ్వర్



అలుపెరగని అంబులెన్స్ డ్రైవర్లు

- రాత్రింబవళ్లు శ్రమిస్తూ సహాయక చర్యల్లో కీలక పాత్ర
- దేశ నలుమూలలకు మృతదేహాల తరలింపు
- ఇంత దారుణం గతంలో చూడలేదంటూ ఆవేదన

పటాన్‌చెరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమలో జరిగిన దుర్ఘటన బాధితులను ఆదుకోవడానికి చేపట్టిన సహాయక చర్యల్లో అంబులెన్స్ డ్రైవర్లు అలుపెరగని యోధులుగా నిలుస్తున్నారు. నాలుగు రోజులుగా రాత్రింబవళ్లు శ్రమిస్తూ, తమ విధి నిర్వహణలో రాజీ పడకుండా, ఈ విపత్కర పరిస్థితిలో మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

30 అంబులెన్స్‌లు.. అవిశ్రాంత సేవలు

సిగాచి ప్రమాద బాధితులకు సేవలు అందించేందుకు ఉస్మానియా, గాంధీ, నల్గొండ, గజ్వేల్, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, సంగారెడ్డి నుంచి మొత్తం 30 ప్రభుత్వ అంబులెన్స్‌లను రప్పించారు. ఈ అంబులెన్స్‌ల పైలట్‌లు (డ్రైవర్లు) దేశంలో ఏ ప్రాంతానికైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. ఇప్పటివరకు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను వారణాసి, బీహార్, ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, కడప, విజయవాడ, చిత్తూరు వంటి సుదూర ప్రాంతాలకు తరలించారు. చికిత్స పొందుతున్న బాధితులు ఉన్న ఆసుపత్రుల వద్ద కూడా 24 గంటలూ అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు.



సిగాచి ప్రమాద సహాయక చర్యల్లో అంబులెన్స్ డ్రైవర్ల బృందం

మూటకట్టి తెచ్చాం



కర్తవ్య నిర్వహణలో రాజీ పడకుండా పనిచేస్తున్నాం. ప్రమాదాలలో చిక్కుకున్న క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రులకు చేర్చడమే లక్ష్యంగా విధి నిర్వహణ కొనసాగిస్తున్నాం. సిగాచి ఘటనలో కొందరు బాధితుల శరీర భాగాలను మూట కట్టుకుని తెచ్చాం. కొందరి కాళ్లు, చేతులు, ఇతర శరీర భాగాలను సైతం సేకరించి జాగ్రత్తగా మార్చురీకి చేర్చాం. క్షతగాత్రులకు సత్వరం వైద్య సేవలు అందించేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కాకుండా ఆసుపత్రులకు తరలించేందుకు కృషి చేశాం

- అరుణ్, అంబులెన్స్ పైలట్

హృదయవిదారకంగా ఉంది



గతంలో ఏనాడు ఈ తరహా దారుణ సంఘటన చూడలేదు. ప్రమాదం జరిగిన చోట పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. బాధితుల ఆర్తనాదాలు ఇప్పటికీ చెవుల్లో మార్మోగుతున్నాయి. ఆసుపత్రికి తరలించిన ప్రతీ ఒక్కరి ప్రాణాలు కాపాడాలన్నదే మా ఆశయం. నాలుగు రోజులుగా సహాయక చర్యల్లో పాలుపంచుకుంటూ, అలుపెరగకుండా పనిచేయడం ద్వారా విధి నిర్వహణలో సంతృప్తి పొందుతున్నాం. బాధితులను వారి గమ్యస్థానాలకు చేర్చడానికి సిద్ధంగా ఉన్నాం. దేశంలోని నలుమూలలకు పార్థివదేహాలను తరలించేందుకు అధికారులు చేసిన ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తాం


- నవీన్‌గౌడ్, అంబులెన్స్ పైలట్


ఎంతదూరం వెళ్లేందుకైనా సిద్ధంగా ఉన్నాం



బాధితుల కోసం ఎంతదూరమైనా అంబులెన్స్‌ను తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం. నాలుగు రోజులుగా నిరవధికంగా పనిచేస్తున్నాం. సహాయక చర్యల్లో శక్తి వంచన లేకుండా పాలుపంచుకోవాలని మా కుటుంబ సభ్యులు సైతం ప్రోత్సహిస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితిలో ప్రతీ ఒక్కరం స్వచ్ఛందంగా పనిచేస్తున్నాం. డ్రైవర్లంతా కలిసికట్టుగా ఉంటూ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తున్నాం.

- కృష్ణ, అంబులెన్స్ పైలట్





రోడ్డు ప్రమాదంలో ఎస్సై దుర్మరణం

- ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన కారు
- బల్కంపేటలో బందోబస్తుకు వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదం

కంది, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇండికేటర్స్ వేయకుండా రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని కారు ఢీకొన్న ఘటనలో హైదరాబాద్ నగరంలోని ఫిల్మ్‌నగర్ ఎస్సై రాజేశ్వర్ (54) దుర్మరణం పాలయ్యారు. ఇందుకు సంబంధించి సంగారెడ్డి రూరల్ ఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని చాణిక్యపురికాలనీలో నివాసం ఉంటున్న ఎం.రాజేశ్వర్ వారం క్రితం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ ఎస్సైగా విధుల్లో చేరారు. బుధవారం రాత్రి వరకు బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద బందోబస్తు డ్యూటీ ముగించుకుని అర్ధరాత్రి సంగారెడ్డికి కారులో తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో కంది శివారులోని చేర్యాల గేటు వద్ద హైవే పక్కన నిలిపిఉంచిన లారీని వెనక నుంచి రాజేశ్వర్ కారు ఢీకొట్టారు. ఈ ఘటనలో తల పగిలి తీవ్ర రక్తస్రావం జరిగింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. హైవే పెట్రోలింగ్ పోలీసులు వెంటనే ఆయనను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్సై రాజేశ్వర్ 1990లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. నాలుగు నెలల క్రితమే సబ్ ఇన్స్‌పెక్టర్‌గా ప్రమోషన్ పొందారు. వారం రోజుల క్రితం ఫిల్మ్‌నగర్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అయితే, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్సై అంత్యక్రియలు సంగారెడ్డి మార్కెట్‌లో ఉన్న శ్మశానవాటికలో అధికార లాంఛనాలతో నిర్వహించారు.

భూ తగాదాలతో అన్నను హత్య చేసిన తమ్ముడు

- ఆలస్యంగా వెలుగులోకి..

జోగిపేట రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : భూ తగాదాలతో అన్నను తమ్ముడు హత్య చేసిన ఘటన జోగిపేట మండలం తాలెల్మ-వట్‌పల్లి మండలం పల్వట్ల శివారులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పల్వట్ల గ్రామానికి చెందిన మంగలి సాయిలు కనిపించడం లేదని 15 రోజుల క్రితం భార్య వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. తన భర్తను మరిది మల్లేశం హత్యచేసి ఉంటాడని సాయిలు భార్య అనుమానాన్ని వ్యక్తం చేయడంతో పోలీసులు మల్లేశంను విచారించారు. అన్న సాయిలును తానే హతమార్చి పూడ్చిపెట్టినట్లు మల్లేశం విచారణలో అంగీకరించాడు. దీంతో పోలీసులు మృతదేహం కోసం గురువారం గాలింపు చర్యలు మొదలుపెట్టారు. పూర్తి వివరాలను తెలియాల్సి ఉంది.

మరో మహిళతో భర్త..

- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న భార్య

చేర్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మరో మహిళతో భర్త వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా, భార్య తమ బంధువులు, మహిళా సంఘాల నేతలతో కలిసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గురువారం సిద్దిపేట జిల్లా చేర్యాలలో ఆందోళన చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. చిన్నకోడూరు గ్రామానికి చెందిన ఏటీ బాబు గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా ఇరువురిమధ్య మనస్పర్థలు రావడంతో తగాదాపడిన బాబు కుటుంబానికి దూరంగా ఉంటూ, మరో మహిళతో కలిసి నివసిస్తున్నాడు. వారు చేర్యాలలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న విషయం తెలుసుకున్న భార్య గురువారం ఉదయం తమ బంధువులు, మహిళాసంఘాల నాయకులతో కలిసి అక్కడికి వచ్చి వారు ఇంట్లో ఉండగా, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. భార్య వెంట వచ్చిన వారు అతడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దాడికి దిగారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో వారు వచ్చి బాబును, అతడితో ఉన్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. తనను శారీరకంగా, మానసికంగా హింసించాడని భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నీరేష్ తెలిపారు.





కమలాపూర్‌లో వ్యక్తి దారుణహత్య

పెద్దశంకరంపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు పెద్దశంకరంపేట మండల పరిధిలోని కమలాపూర్‌లో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పేట మండల పరిధిలోని కమలాపూర్ గ్రామానికి చెందిన తోట సుధాకర్(43) ప్రతి రోజు మాదిరిగానే తన ఇంటి ఆవరణలో నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పదునైన ఆయుధాలతో తలమీద దాడి చేయడంతో సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సుధాకర్ ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు గురువారం ఉదయం సమాచారం అందించడంతో, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి, పేట, అల్లాదుర్గం ఎస్సైలు ప్రవీణ్‌రెడ్డి, శంకర్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్‌టీం, జాగిలాలతో పోలీసులు విచారణ చేపట్టారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి తోట మాణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి

హవేళిఘణపూర్/కౌడిపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లోని వేర్వేరు గ్రామాల్లో విద్యుదాఘాతంతో గురువారం ఇద్దరు రైతులు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్లితే.. పీర్యా తండాకు చెందిన పాత్‌లోత్ బన్సీలాల్ (38) కూకుట్లపల్లి శివారులోని తన పొలానికి పురుగు మందు కొట్టేందుకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. భూపతిపూర్ గ్రామానికి చెందిన మంద అంజయ్య (47) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. తన పొలం వద్ద ఉన్న టేకు చెట్ల కొమ్మలు కొట్టివేస్తుండగా పైనున్న 11 కేవీ వైర్లకు కొమ్మ తగలడంతో అకస్మాత్తుగా కరెంట్ పాసు అవ్వడంతో మృతిచెందాడు.

బూజు కర్రకు కరెంట్ సరఫరా అయి మరొకరు..

రామచంద్రాపురం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వెలిమెల మాజీ సర్పంచ్ వై.నరేందర్‌రెడ్డి సోదరుడు ప్రవీణ్‌రెడ్డి గురువారం దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ప్రవీణ్‌రెడ్డి రోజూ మాదిరిగానే ఇంట్లో చిన్నచిన్న పనులకు పూనుకున్నాడు. ఈ క్రమంలో బయట కర్రతో బూజు దులుపుతున్న అతడి కర్రకు విద్యుత్ షాక్ తగిలి రోడ్డుపై పడ్డ ప్రవీణ్ తలకు తీవ్ర గాయమైంది. దీంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

ఖేడ్ సబ్‌రిజిస్ట్రార్‌కు గాయాలు

అల్లాదుర్గం, జూలై 3, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మెహిదీపట్నానికి చెందిన మహ్మద్ నిజామోద్దీన్ నారాయణఖేడ్‌లోని సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురవారం సాయంత్రం విధులు నిర్వహించిన అనంతరం తన నివాసానికి కారులో వెళ్తున్న క్రమంలో అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామ శివారులోని జాతీయరహదారి పై ఉన్న కల్వర్టును బలంగా ఢీ కొట్టడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. అయితే కారు నడుపుతున్న నిజిమోద్దీన్ స్వల్ప గాయాలతో బయటపడగా అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

దుర్గమ్మతల్లి జాతర ఏర్పాట్లను పరిశీలించిన నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని దుర్గమ్మతల్లి జాతర ఏర్పాట్లను తెలంగాణ పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పన చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి గురువారం పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు జాతర పనులు, కార్యక్రమాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. 18న దుర్గమ్మ జాతర, 20న బోనాలు అని నిర్మలాజగ్గారెడ్డి నిర్ణయించారు. జాతరకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ తోపాజి అనంతకిషన్, యువజన కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్, శ్రీకాంత్ , శ్రీహరి, సందీప్, మాజీ కౌన్సిలర్ కుమార్ పాల్గొన్నారు.


సంగారెడ్డిలోని దుర్గమ్మతల్లి జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


డీఎంహెచ్‌వో ఆఫీస్ ఏవో శ్రీవాణికి వినతిపత్రం అందజేస్తున్న మెడికల్ యూనియన్ నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆరోగ్య మిషన్ కింద పనిచేస్తున్న వైద్య ఉద్యోగులకు రెండునెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో శ్రీవాణికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, ఇతర సర్కారు ఆస్పత్రుల్లో ఎన్‌హెచ్‌ఎం కింద వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేయాలని, లేకపోతే ఆందోళనలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాజు, కోశాధికారి ఇమ్రాన్, ఉపాధ్యక్షుడు రాము, నాయకులు విజయ్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'సమ్మేళనానికి తరలిరావాలి'

నర్సాపూర్/చేగుంట, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు పాల్గొనే పార్టీ సమ్మేళనానికి మెదక్ జిల్లాలోని గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఉన్న ముఖ్యమైన నాయకులు తరలిరావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వారు నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ 4న లాల్‌బహదూర్ స్టేడియంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న ఈ సమ్మేళనానికి ఖర్గేతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్‌తో పాటు ముఖ్యమైన రాష్ట్ర నేతలు హాజరుకానున్నందున మెదక్ జిల్లా నుంచి ప్రస్తుత గ్రామ, మండల అధ్యక్షులతో పాటు కొత్తగా పదవుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు కూడా హాజరుకావాలని సూచించారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల కో ఆర్డినేటర్ మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు వడ్ల నవీన్ పిలుపునిచ్చారు. గురువారం చేగుంట ఆర్అండ్ఆర్ గెస్ట్‌హౌస్‌లో మండలంలోని పలు గ్రామాల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

వేతనాలు చెల్లించేవరకూ పనులు నిర్వహించం

చిన్నశంకరంపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : తమకు వేతనాలు చెల్లించేవరకూ విధులు పనులు చేపట్టమని పారిశుధ్య కార్మికులు తేల్చిచెప్పారు. ఈ విషయమై గురువారం ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీవో దామోదర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

బకాయిలను విడుదల చేయాలి

చేగుంట/పాపన్నపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జీవో 317 బాధితులందరికీ న్యాయం చేసి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ పేర్కొన్నారు. చేగుంట మండలంలోని పలు పాఠశాలలో గురువారం సభ్యత్వ నమోదు చేపట్టారు. అలాగే పాపన్నపేట మండల పరిధిలోని వివిధ పాఠశాలలో తపస్ మండల అధ్యక్షుడు మంగ నరసింహులు, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు.

కుమారుడూ.. తన బడిలోకే..!


కుమారుడితో మహేందర్

నారాయణఖేడ్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఓ ఉపాధ్యాయుడు తాను పాఠాలు బోధిస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనూ తన కుమారుడిని చేర్పించి ఆదర్శంగా నిలిచాడు. కల్హేర్ మండలం బీబీపేటకు చెందిన గుండు మహేందర్ నారాయణఖేడ్ మండల పరిధి బాణాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన కుమారుడు గుండు అభిజిత్ 4వ తరగతి చదువుతుండగా గురువారం తాను పనిచేస్తున్న పాఠశాలలో చేర్పించారు. తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న మహేందర్‌ను బాణాపూర్ గ్రామస్థులు అభినందించారు.

అసత్య ఆరోపణలు చేస్తే సహించం

చిన్నశంకరంపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామానికి బాధ్యతారాహితంగా సేవలందిస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మపై అసత్య ఆరోపణలు చేస్తే సహించమని మాజీ ఎంపీటీసీ శివకుమార్ అన్నారు. పద్మ విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని వారం క్రితం కొంతమంది ఎంపీవో గిరిజారాణికి, కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ శివకుమార్, పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ సర్పంచుల పదవీకాలం ముగిసిపోయి 18 నెలల కావస్తుందని అప్పటి నుంచి కార్యదర్శి గ్రామంలో విధులను సక్రమంగా నిర్వర్తిస్తుందన్నారు. అధికారులు అసత్య ఆరోపణలపై విచారించి పద్మకు న్యాయం చేయాలని ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు.

అనారోగ్యంతో హెచ్‌ఎం మృతి

పాపన్నపేట/మెదక్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో గాంధీరిపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న బూర్ల లింగం(61) గురువారం మృతి చెందాడు. రెండేళ్లుగా ఆయన ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. కొంతకాలంగా దీర్ఘకాలిక అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్నారు. ఆగస్టులో రిటైర్డ్ కావాల్సి ఉన్నది. ఆయన మృతిపట్ల ఎంఈవో, హెచ్‌ఎంలు తెలిపారు.

భూమి పరిశీలన

కల్హేర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వివిధ రూట్లలో టీ ఫైబర్ కేబుల్ లైన్ ఏర్పాటుకోసం క్రిష్ణాపూర్ శివారులో నుంచి ఖానాపూర్(కె), జంలాతండా, తుకారాంతండా, సిర్గాపూర్ మండలంలోని పోచాపూర్ క్రాస్‌రోడ్డు వరకు, నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావ్‌పేట శివారులో నుంచి సిర్గాపూర్ మండలం కడ్పల్ గ్రామ శివారులోని రహదారికి అనుకుని ఉన్న అటవీశాఖ భూములను సంగారెడ్డి జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్‌వో) శ్రీధర్‌రావ్ గురువారం పరిశీలించారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి : చుక్క రాములు


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న చుక్క రాములు

పుల్‌కల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. చౌటకూర్ మండలం శివంపేట శివారు బీరు పరిశ్రమ ఆవరణలో గురువారం కార్మికులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాద, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీరం మల్లేశం, జి.సాయిలు, జిల్లా ఉపాధ్యక్షుడు, బీరు పరిశ్రమ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.భాగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

దాబాలు, హోటళ్లలో మద్యం అనుమతిస్తే చర్యలు


హోటళ్ల యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

తూప్రాన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : దాబాలు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించేందుకు అనుమతించకూడదని తూప్రాన్ డీఎస్పీ జే.నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. మద్యం అనుమతిస్తే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, సీజ్ చేస్తామని హెచ్చరించారు. గురువారం పట్టణంలో తూప్రాన్ పోలీసు సబ్ డివిజన్ పరిధి దాబా హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. యజమానుల విజ్ఞాపనతో హోటళ్లను రాత్రి 11.30 గంటలకు చివరి ఆర్డర్ తీసుకుని అర్ధరాత్రి 12 గంటలకు మూసేయాలని సూచించారు. హోటళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, తూప్రాన్ ఎస్ఐ శివానందం, నర్సాపూర్ ఎస్ఐ లింగం, చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి, నార్సింగి ఎస్ఐ అహ్మద్ మైనుద్దీన్ పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగుతో అధిక లాభాలు


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న సోమేశ్వరరావు

కోహీర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఉద్యానవన పంటల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి (డీహెచ్‌ఎస్‌వో) సోమేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం కోహీర్ మండలంలోని పీచేర్యాగడి గ్రామంలో గల రైతువేదికలో సమీకృత ఉద్యానవన అభివృద్ధి మిషన్ ఆధ్వర్యంలో ఉద్యానవన పంటల సాగుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రైతులు ప్రతిసారి సాధారణ పంటలు సాగు చేయడమే కాకుండా ఉద్యానవన పంటల సాగువైపు కూడా మొగ్గుచూపాలని కోరారు. ఉద్యాన పంటలు సాగుచేసుకుంటే ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. అంతేకాకుండా ఉద్యానవన పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఉద్యాన పంటలు సాగు చేసుకుంటున్న-= రైతులు ఎదుర్కొంటున్న చీడ పీడ నివారణకు సంబంధించి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన శాఖ అధికారి సునీత, ఇన్‌చార్జి ఏవో వినోద్, ఏఈవో సవిత, శాస్త్రవేత్త వరప్రసాద్, మైక్రో ఇరిగేషన్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రిష్ణాపూర్ గ్రామ సమీపంలో చిరుత సంచారం


క్రిష్ణాపూర్ గ్రామ సమీపంలోని నల్లవాగు కాలువపై చిరుత పాదాలు పడిన దృశ్యం

కల్హేర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని క్రిష్ణాపూర్ గ్రామ సమీపంలో చిరుతపులి సంచరించినట్లు గ్రామస్థులు గురువారం తెలిపారు. గ్రామ సమీపంలోని నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువపై చిరుత సమీప నాగ్‌ధర్ అటవీ ప్రాంతంలో నుంచి వచ్చి సంచరించినట్లు తెలిపారు. నల్లవాగు కాలువ మరమ్మతు పనులు కొనసాగుతుండగా గురువారం పనులకు వచ్చిన కూలీలు చిరుత పాదాలు గుర్తించి నీటిపారుదలశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు నల్లవాగు ప్రాజెక్టు డీఈఈ పవన్ కుమార్ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినట్లు వారు తెలిపారు. సమీప నాగ్‌ధర్ అటవీ ప్రాంతంలో చిరుత పులులు ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ఇప్పటికే నాగ్‌ధర్ అటవీ చుట్టూ ఉన్న రాపర్తి, క్రిష్ణాపూర్, మీర్‌ఖాన్‌పేట్, ఖానాపూర్(కె), బీబీపేట్, సిర్గాపూర్ మండలం ఖాజాపూర్, కడ్పల్, నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావ్‌పేట తదితర గ్రామాల రైతులకు చెందిన పశువులపై దాడులు చేసి చంపి తిన్న విషయం విదితమే. కాబట్టి అటవీ ప్రాంతం సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

చిలప్‌చెడ్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. గురువారం చిలప్‌చెడ్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. చిలప్‌చెడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు, పాఠ్య ప్రణాళికలు, దినచర్య, తరగతి గది బోధన, విద్యార్థుల అభ్యాసన రికార్డు షీట్లు పరిశీలించారు. విద్యార్థులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఎంఈవో విఠల్, చిలప్‌చెడ్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాం

చిన్నశంకరంపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో వ్యవసాయ సాగు కోసం మెదక్ జిల్లాలో రైతులకు సరిపడా ఎరువుల బస్తాలను అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయాధికారి వినయ్‌కుమార్ అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండల పరిధిలోని గవ్వలపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. గోదాంలలో ఎరువుల బస్తాలను పరిశీలించి, మాట్లాడారు. నిబంధనల మేరకే ఎరువుల బస్తాలను అమ్మాలని సూచించారు. ఆయన వెంట ఏవో లక్ష్మి, ప్రవీణ్ ఉన్నారు.

ఎన్ఐఈయూ జిల్లా అధ్యక్షుడిగా రాహుల్

సంగారెడ్డి రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : నేటివ్ ఇండియన్స్ ఫోరం ఎంప్లాయీస్ యూనియన్(ఎన్ఐఈయూ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా రాహుల్ నియామకమయ్యారు. గురువారం ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు బీరయ్యయాదవ్ రాహుల్‌కు నియామకపత్రం అందజేసి మాట్లాడారు. దేశంలో మూలవాసుల అభివృద్ధి, వారి సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు విక్రమ్, సభ్యుడు శేఖర్ పాల్గొన్నారు.

తూప్రాన్ వాసికి నాచగిరి క్షేత్ర చైర్మన్ పదవి


రవీందర్‌గుప్తా

తూప్రాన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా వర్గల్ మండల నాచారం గుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ చైర్మన్‌గా తూప్రాన్ పట్టణానికి చెందిన పల్లెర్ల రవీందర్‌గుప్తా నియామకం అయ్యారు. ఈ మేరకు దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశాలు జారీచేశారు. రవీందర్‌గుప్తా మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ తూప్రాన్ పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. డైరెక్టర్లుగా జగ్గన్నగారి సురేందర్‌రెడ్డి(పోతరాజుపల్లి), జగ్గయ్యగారి శేఖర్, దేశపతి ఉషశ్రీ(గజ్వేల్), గాల్ కిష్టయ్య, చందా నాగరాజు వేలూరు, కర్రె పద్మ(ఆనంతగిరిపల్లి), కొత్తపల్లి శ్రీనివాస్(నాచారం), జేఎస్ తిరుమలరావు, రుద్ర శ్రీహరి(హైదరాబాద్), ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా బెల్లంకొండ జగన్నాథచార్యులను నియమించారు. ఈనెల 5న శనివారం ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం చేయనుంది.

రాంచందర్‌రావుకు నాయకుల సన్మానం


రాంచందర్‌రావును సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు

పెద్దశంకరంపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును బీజేపీ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, మాజీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ ఖేడ్ ప్రాంతంలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

రోడ్ల మరమ్మతులకు రూ.50 కోట్లు మంజూరు

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఖేడ్ నియోజకవర్గంలో పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖకు సంబంధించిన పలు రోడ్లకు మరమ్మతులు, తారు రెన్యూవల్ పనుల కోసం సుమారు రూ.50 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. గురువారం క్యాంపు కార్యాలయంలో విలేకరుతో మాట్లాడుతూ ఖేడ్- నాగల్‌గిద్ద- కరస్‌గుత్తి, ఖేడ్- రాయిపల్లి, మాసాన్‌పల్లి- కల్హేర్ రోడ్ల మరమ్మత్తులకు రూ.50 లక్షల చొప్పున మంజూరు కాగా పదిరోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయన్నారు. ఖేడ్ మున్సిపల్ పరిధిలోని మంగల్‌పేట భవానీ మందిరం నుంచి శివాజీ చౌక్ వరకు సీసీరోడ్డు, రోడ్డు పక్కన విశాలమైన మురుగు కాల్వల నిర్మాణం కోసం రూ.15 కోట్లు మంజూరయ్యాయన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, తండాలకు రోడ్ల కోసం రూ.25 కోట్లు మంజూరు కాగా.. అందులో టి.లింగంపల్లి నుంచి బోరంచ మీదుగా బెల్లాపూర్‌లోని జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ రెండు వరుసల రోడ్డుతో పాటు ఖేడ్ నుంచి పంచగామ, రాణాపూర్ మీదుగా తుమ్నూరు వరకు తారు రోడ్డు ఉందని తెలిపారు. రోడ్లు లేని 12 తండాలకు తారు రోడ్ల కోసం ఎస్టీ ఎస్డీఎఫ్ కింద రూ.12.50 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, నాయకులు వినోద్‌పాటిల్, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి


పోలీసులతో మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ శ్రీనివాస్‌రావు

నర్సాపూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చేవారితో మర్యాదగా వ్యవహరించాలని మెదక్ ఎస్పీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం నర్సాపూర్ సర్కిల్ పరిధిలోని నర్సాపూర్, కౌడిపల్లి, చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ల పరిసరాలను, సీజ్‌చేసిన వాహనాలను పరిశీలించారు. కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అదేవిధంగా పోలీస్‌స్టేషన్లలోని రికార్డులు, సీడీ ఫైల్స్ తనిఖీ చేశారు. ప్రతీ రికార్డు అప్‌డేట్ ఉండాలని సూచించారు. అదేవిధంగా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న సీసీ కెమరాల పనితీరును స్థానిక ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య

రాయికోడ్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో రాయికోడ్ మండలానికి రూ.45 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మంజూరైందని తెలిపారు. ఈ సెంటర్ ప్రారంభమైతే మారుమూల ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మునిపల్లి మండలం బుదేరా నుంచి రాయికోడ్ మండలం సిరూర్ వరకు సుమారు రూ.80 కోట్లతో రెండు లైన్ల రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలాజీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌లోడ్ పెంచాలని ఉద్యోగుల మహాధర్నా

కంది, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడి జిల్లా కంది మండలం ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో వర్క్‌లోడ్ పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆ ఫ్యాక్టరీ ఉద్యోగులు మహాధర్నా నిర్వహించారు. ఇందులో భాగంగా 200 మంది ఉద్యోగులు ఫ్యాక్టరీ గేటు ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా బీఎంఎస్ నాయకులు నాయకులు ఈశ్వరయ్య, జితేందర్, బానరసయ్య మాట్లాడుతూ గతంలో మాదిరిగానే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయలన్నారు. ఈ మహాధర్నాలో బీఎంఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రభు, వెంకట్‌రెడ్డి, బలరాం, రవి, అనిల్, శ్రీధర్, పవన్ పాల్గొన్నారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా చంద్రశేఖర్ పటేల్

నారాయణఖేడ్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి సివిల్ జడ్జి సహాయ సెన్సస్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కంగ్టి మండలం సిద్దంగిర్గా గ్రామానికి చెందిన న్యాయవాది చంద్రశేఖర్‌పటేల్ నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించినందుకు ఎంపీ సురేష్ షెట్కార్‌ను ఆయన స్వగృహంలో కలిసి శాలువాతో సన్మానించారు. అలాగే చంద్రశేఖర్ పటేల్‌ను కూడా ఎంపీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు రషీద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహేర్, యువజన కాంగ్రెస్ సిర్గాపూర్ మండల అధ్యక్షుడు నగేష్‌చారి, పాల్గొన్నారు.

'మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలి'

నారాయణఖేడ్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : నాగల్‌గిద్ద మండలం గంగారాంతండా సమీపంలో బుధవారం రాత్రి ట్రాక్టర్, బైక్‌ను ఢీకొన్న సంఘటనలో మృతిచెందిన అదే మండలంలోని పత్తునాయక్‌తండాకు చెందిన రాథోడ్‌మారుతి(40), గంగారాంతండాకు చెందిన చౌహాన్‌మారుతి(50) పార్థివదేహాలకు ఖేడ్ ఏరియా వైద్యశాలలో గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. అయితే మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తండావాసులు, బంధువులు జాతీయ రహదారిపై రాస్తారోకో, ఆందోళన చేపట్టారు. దీంతో రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా స్థానిక సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖేడ్, మనూరు, నాగల్‌గిద్ద, ఎస్ఐలు విద్యాచరణ్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, సాయిలు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. న్యాయం జరిగేలా చూస్తామని సీఐ, ఎస్ఐలు హామీనివ్వడంతో ఆందోళన విరమించారు.

రఘునందన్‌రావుకు బీజేపీ శ్రేణుల పరామర్శ

పెద్దశంకరంపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవలే హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేసుకున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావును బీజేపీ మండల అధ్యక్షుడు శ్రావణ్, మాజీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ గురువారం పరామర్శించారు. వీరివెంట పార్టీ మండల నాయకులు బుగుడాల క్రిష్ణ, ఎర్ర శ్రీహరి, భూషణం, తదితరులు ఉన్నారు.

గమ్యం చేరని ప్రయాణం

5వ పేజీ తరువాయి

జరుగుతున్నాయి. గంటల తరబడి భారీ వాహనాలు రోడ్డు పక్కన పార్కింగ్ చేస్తున్నా పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదు.

బ్లాక్‌స్పాట్ల వద్ద సూచికలేవీ?

సంగారెడ్డి జిల్లాలో 65వ నంబరు జాతీయ రహదారిపై పోలీసులు కొన్ని బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. పటాన్‌చెరు ఆర్టీసీ బస్టాండ్, ముత్తంగి స్వీట్‌హార్ట్ హోటల్, ముత్తంగి గ్రామం, ఇస్నాపూర్ చౌరస్తా, లక్డారం గేట్, నోవాపాన్ చౌరస్తా, రుద్రారం గ్రామాలను ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవలంపేట, కంది, జమ్‌జమ్ దాబా, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, కొండాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ చౌరస్తా, సదాశివపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సదాశివపేట బస్టాండ్, నందికంది, ఎంఆర్ఎఫ్ కాలనీ, కోహీర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిగ్వాల్, సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామాలను కూడా బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. ఆయా ప్రదేశాల్లో ఇదివరకు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను రోడ్డు విస్తరణ కారణంగా తొలగించారు. నెలల తరబడి పనులు కొనసాగుతున్నా ప్రమాద సూచికలుగానీ, బోర్డులుగానీ ఏర్పాటు చేయలేదు. దీంతో, వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారినపడుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో 2024 సంవత్సరంలో మొత్తం 852 ప్రమాదాలు జరిగాయి. 384 మంది మృత్యువాతపడగా 913 మంది క్షతగాత్రులయ్యారు. 2025లో ఇప్పటి వరకు 401 ప్రమాదాల్లో 196 మంది మృతిచెందారు. 486 మంది గాయపడ్డారు. ఇందులో అత్యధికంగా హైవే 65పై జరిగినవే కావడం గమనార్హం.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వహించాలి : ఆర్డీవో

మెదక్ అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి బీఎల్‌వోలకు సూచించారు. మెదక్ మండలంలోని 34 మంది బీఎల్‌వో, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వీఆర్ఏలకు గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసెంబ్లీ స్థాయి శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డీవో హాజరై మాట్లాడుతూ.. ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వహించాలన్నారు. నిష్పాక్షపాతంగా పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. ఇంటింటికి వెరిఫికేషన్ ఫారం -6 ద్వారా ఓట్ల నమోదు, ఫారం-6ఏ, ఫారం-7, ఫారం-8, బీఎల్‌వో యాప్, ఓటర్ హెల్ప్‌లైన్‌యాప్ గురించి వివరించాలన్నారు. మెదక్ నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఈనెల 13 వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు పాల్గొన్నారు.

రూ.2.66 కోట్లతో మార్కెట్‌యార్డులో అభివృద్ధి పనులు

సదాశివపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో రూ.2.66 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిసింది. గురువారం మార్కెట్ కార్యాలయంలో చైర్మన్ ఎస్.కుమార్, వైస్ చైర్మన్ కంది క్రిష్ణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాలకవర్గం మార్కెట్‌యార్డును అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. రూ.28 లక్షలతో ప్రహరీ నిర్మాణం, మార్కెట్‌యార్డులో స్వాగతతోరణం, రూ.24 లక్షలతో రైతుకూలీలు, మహిళల కోసం మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, రూ.7 లక్షలతో మార్కెట్‌యార్డు రక్షణ కోసం గేట్లు, రూ.5 లక్షలతో వ్యవసాయ మార్కెట్‌యార్డులో సీసీకెమెరాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే మరో రూ.2.02 కోట్లతో మార్కెట్‌యార్డు చుట్టూ దుకాణాల సముదాయం నిర్మించేందుకు పాలకవర్గం ఏకగ్రీవంగ ఆమోదించింది. అందులో భాగంగా హమాలీలకు నూతన లైసెన్సులు అందజేశారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ జేడీ రియాజ్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.